# తీరిక

**- నోరి రాధిక**

గుడిలో నుండి వేంకటేశ్వర సుప్రభాతం గట్టిగా వినిపించడంతో నిద్రమెలకువ వచ్చేసింది సమయకి. 'ఆలస్యం అయినట్టుంది. టైమెంతయిందో? బోలెడన్ని పనులున్నాయి తాతయ్య పూజ మొదలెట్టాసారేమో! అనుకుంటూ వులిక్కిపడి లేచి, గబగబా స్నానం ముగించి పూలబుట్టతో తోటలో అడుగు పెట్టింది. ధనుర్మాసం చలి బయట బాగా ఉంది. ఇంకా చీకటిగానే ఉంది. తోటలో ఇంకా లైట్లు ఉన్నా పగటి వేళంత స్పష్టంగా కనిపించడంలేదు. ఆమె పూలు కోయడం మొదలు పెట్టిన అయిదు నిమిషాలకి పరుగు పరుగున వచ్చాడు నూకరాజు "నన్ను పిలవలేదేమిటి అమ్మాయిగోరు" అనుకుంటూ. "ఫరవాలేదులే! నిద్రపోతున్నావేమో, నిన్ను లేపడం ఎందుకని.... " అని సమయ ఇంకా ఏదో అనబోతుంటే "అయ్యయ్యో! నిద్రేమిటమ్మా! సీకట్లో పురుగు, పుట్ర వుంటాయని పెద్దయ్యగారు పూలు కోసేంత వరకు మీకు తోడుగా ఉండమన్నారు. మీరొక్కరూ ఇలా పూలు కోస్తున్నారని తెలిస్తే నన్ను సంపేత్తారు" అన్నాడు భయంగా. "సరేలే! నన్ను ఏ పురుగో, పామో కరుస్తుందన్న ఆరాటం కంటే తాతయ్య నిన్నెక్కడ తిడతారోనన్న భయమే ఎక్కువగా వున్నట్టుంది" నవ్వుతూ అంది సమయ.



ఆమె పూలు కోయటం పూర్తి చేసుకొని వచ్చేసరికి పూజ గదిలో ఆమె తాతగారు, బామ్మగారు పూజ మొదలు పెట్టేసారు. గబాగబా పూల బుట్టను అక్కడ పెట్టి వంటింట్లోకి వెళ్ళి ప్రసాదం వండడం మొదలు పెట్టింది. పూజ, నైవేద్యం అన్నీ అయిన తర్వాత తిరుప్పావై లోని పద్యం ఒకటి రాగయుక్తంగా చదివింది. ధనుర్మాసం ముప్పైరోజులూ రోజుకొక్కటిగా తిరుప్పావై లోని పద్యాలు చదవటం, నైవేద్యంకోసం రోజు చక్రపొంగలి చేయటం ఆమెకి అలవాటే! అంతా అయిన తర్వాత తీర్థం, ప్రసాదం తీసుకుని పూజగదిలోంచి బయటకు వచ్చింది. "ఎంత బాగా పాడావే తిరుప్పావై పద్యం! ఏదో, నీ చదువు అయిపోయి ఇంకా వుద్యోగం అంటూ ఏదీ మొదలు పెట్టలేదు కాబట్టి నీకు కాస్త ఈ పూజలకీ, పాటలకీ, పద్యాలకీ టైం దొరొకుతోంది కానీ లేకపోతే ఈ పూజలు చేయటానికి, ప్రసాదాలు వండటానికి నీకు తీరికుంటుందా?" అన్నారు బామ్మ గారు సమయ వైపు మురిపెంగా చూస్తూ. అప్పటికి తెల్లవారిపోయింది. వంటావిడ వచ్చి వంట ప్రయత్నాలు మొదలు పెడుతున్నారు. "సమయమ్మా! ఇవాళ వంట ఏంచేయమంటావు?" అని అడిగారు ఆవిడ. ఆ పూటకి ఏం చేయాలో ఆవిడకి అన్నీ చెబుతూ "పనస పొట్టు కూరలో ఆవఘాటు కొంచెం తక్కువగా వేయండి. పిన్నిగారు! పోయినసారి ఆవ ఎక్కువై వేడి చేసిందనుకున్నారు తాతయ్య" అంది సమయ. ఆవిడ అలాగే అన్నట్లుగా తలూపుతూ "ఏదో ప్రస్తుతం నువ్వు తీరికగా వున్నావు కాబట్టి ఇంత సేపు నాతో ఇలా వంటలూ, వార్తూ మాట్లాడటానికి నీకు కుదిరింది కానీ రేపు ఏదన్నా ఉద్యోగం అంటూ మొదలుపెడితే నాతో మాటలు కాదు గదా, నేను చేసింది తింటానికి కూడా సమయం వుండదు నీకు" అంది ఆవిడ మళ్ళీ. "అంతదాకా ఎందుకు? అబ్బాయికి ఇపుడు వీలు కాదన్నారని ఆగాము కానీ ఈ మాఘమాసంలో దీనికి కూడా ఆ-మూడుముళ్ళూ వేయించేసే వాళ్ళం కదా! అప్పుడు వాళ్ళక్కలాగా తను కూడా అత్తవారింట్లో ఏలేది రాజ్యం" అంది వాళ్ళమ్మ అప్పుడే అక్కడికి వస్తూ.

సమయ సిగ్గుపడుతూ అక్కడి నుంచి లేచి హాల్లోకి వచ్చేసరికి అక్కడ ఇల్లు వూడుస్తూ పారు కనిపించింది. "పారూ! ఇలారా" అంటూ దానితో బయట తోటలోకి నడిచింది సమయ. మొక్కలకి నీళ్ళు పోస్తూ కనిపించాడు నూకరాజు అక్కడ. నూకరాజూ! నువ్వు కూడా ఇలారా. ఇంట్లోమాట్లాడితే నాన్నకి, తాతయ్యకి తెలుస్తుందని పారుని కూడా ఇక్కడికే తీసుకొచ్చాను. పారూ! నువ్వు కూడా ఇలారా. ఇప్పుడు చెప్పండి ఇద్దరూ. ఏమిటి మీ పోట్లాట అసలు? పని పాట లేదా

అస్తమానూ ఇలా కీచులాడుకోవటం తప్ప? "నూకరాజు! నువ్వేమిటి పారుకి డబ్బులివ్వకుండా సతాయిస్తున్నావట? ఇంట్లో ఖర్చుకి డబ్బులివ్వకపోతే ఎలా నడుస్తుంది ఇల్లు? ఏం చేస్తున్నావు నీ జీతం?" అని అడిగింది సమయ. "అలా గట్టిగా అడగండి అమ్మాయిగోరూ! ఎప్పుడడిగినా లేదంటాడు. ఏం సేస్తున్నాడో జీతం అంతా మీరైనా గట్టిగా నిలదీయండి అంటోంది" పారు. "ఏడిసావులే! ఏమిటి సేసేది? నోరు మూసుకో" అంటూ పెళ్ళాం మీద గదమాయిస్తూ "అదేం కాదు అమ్మాయిగోరూ! మొన్ననే పాతిక రూపాయలిచ్చా. మళ్ళీ నన్న రాత్రి డబ్బులడిగితే ఎట్టా అమ్మాయిగోరూ? మీరే సెప్పండి. అసలు డబ్బులతో ఏం సెత్తుందో, ఏ సోకులకి తగలెడుతోందో, నన్ను కాదు దాన్నడగండి" అన్నాడు నూకరాజు సమయతో. సమయకి వాళ్ళిద్దరికి నచ్చజెప్పి, వాళ్ళ దెబ్బలాట తీర్చి, ఇద్దరినీ ఒక ఒప్పందం లోకి తీసుకొచ్చేసరికి తల ప్రాణం తోకకొచ్చేసింది. "చిన్న పిల్లలైపోతున్నారు ఇంకెప్పుడూ ఇలా ఇద్దరూ కొట్టు కోకండి. పెద్దయ్యగారికి తెలిస్తే చంపేస్తారు. అని చివరికి ఇద్దరికీ ఏదో ఒప్పందం చేసి "వెళ్ళవే వెళ్ళి నీ ఇల్లు ఊడవటం పూర్తి చేసికో. నూకరాజు! నువ్వుకూడా నీమొక్కల పని పూర్తిచేసుకో" అంటూ పారుని, నూకరాజుని పంపించేసి ఇంట్లోకి నడిచింది సమయ. నూకరాజుని కేకలేసి మందలించినందుకు పారుకి సంతోషంగా ఉంది. "మీరు కొలువేది సేయకుండా ఇంట్లోనే వున్నారు కామట్టి నా గోడు వింటానికి తీరిక దొరికింది. లేకపోతే మీరు దొరుకుతారా?" అంది సమయతో. నూకరాజుకి కూడా సమయ పారునీ మందలించినందుకు చాలా సంతోషంగా ఉంది. "అమ్మాయిగోరూ ఇంటికాడే వున్నారు కామట్టి తన గోడు ఇంటున్నారు లేకపోతే ఆమెగారికి తీరికెక్కడిది అనుకున్నాడు మనుసులో.

సమయ హాల్లోకి వచ్చేసరికి బయట ఆఫీసు రూము దగ్గర ఎవరో ముగ్గురు గుమాస్తాగారితో మాట్లాడుతూ కనిపించారు. "సమయమ్మా! ఒక్కసారి ఇలా వస్తావా?" అని ఆయన పిలిస్తే ఆఫీసు రూములోకి వెళ్ళింది. "వీళ్ళు మన అరటి గెలలు కొనటానికి వచ్చారమ్మా. దానికి సంబందించిన వివరాలన్నీ మొన్న చెప్పాను మీకు. contract అదీ తీసుకొచ్చారు ఇప్పుడు" అన్నారు ఆయన సమయతో. సమయ వారికి నమస్కారం చేసి ఆ contract అంతా గబాగబా చదివింది. contract అంతా last year లాగానే ఉందిగా! కొత్త clause లేవీ లేవుగా!" అంటూ "అంతా సరిగ్గానే వుంది. నాన్నగారికి చూపించండి. సంతకం చేస్తారు" అంది.

"మంచిదమ్మా" అని ఆయన వాళ్ళతో వెళ్ళబోతూ ఉంటే "బాబాయి గారూ! ఆ pest control వాళ్ళకి ఫోను చేసి చెప్పాను. రేపు వాళ్ళ మనషులను పంపుతామన్నారు. వాళ్ళు వచ్చి తోటలో spray చేస్తున్నపుడు కాస్త దగ్గరెవరన్నా వుండేట్లు చూడండి. ఇదే టైము కనక అయితే మాత్రం నేను కూడా రాగలను" అంది మళ్ళీ. "అలాగే నమ్మా, నేను పిలుస్తాలే వాళ్ళు వచ్చినప్పుడు" అన్నాడు ఆయన. "పెళ్ళి, ఉద్యోగం అంటూ ఇంకా ఏది లేదు కాబట్టి నీకు ప్రస్తుతం ఇవన్నీ చూసుకోవడానికి తీరిక ఉంది. లేకపోతే ఇవన్నీ అయ్యగారే చూసుకోవాలి" అన్నాడు ఆయన సమయతో.

సమయ లోపలికి వెళ్ళగానే బామ్మగారు ఎదురు చూస్తున్నారు సమయ కోసం. "సమయా! ఇలా రావే, కాస్త ఈ వుత్తరం రాసిపెట్టు. మళ్ళి మీ తాత, నాన్న భోజనాలంటూ వస్తారు. అన్నారు సమయని చూడగానే. అలాగే బామ్మా" అంటూ సమయ కాగితం, కలం తెచ్చుకొని వచ్చింది వుత్తరం రాయటం కోసం. బామ్మ గారికి ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు ఆ రోజుల్లోనే ప్రేమవివాహం చేసుకొన్నాడు. అప్పటికి ఆయన తర్వాత ఇద్దరు అమ్మాయిలకూ ఇంకా పెళ్ళికాలేదు. అయినా కాబోయే అత్త మామలు ఒత్తిడి చేస్తున్నారని ముందు తను ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. అప్పటినుండి ఏదో తెలీని కారణం, సంకోచం వలన కుటుంబానికి కొంచెం దూరం అయ్యాడు. అదీకాక వ్యాపారంలో బాగా ఆర్జిస్తూ తన కుటుంబంతో కొంచం దూరన వుంటాడు. తల్లితండ్రులు, తోబుట్టినవారి గురించి ఆలోచన కొంచం తక్కువని, ఎంతసేపూ తను, తన సంసారం గురించే చాలా ఆలోచిస్తాడని, బాధ్యతలని తోసిరాజని తన సుఖం చూసుకున్నాడని, స్వార్థపరుడని ఆయనంటే సమయ తండ్రికి కోపం, అందుకే చిన్న కొడుకైనా తల్లితండ్రులని తన దగ్గరే పెట్టుకున్నాడు. అక్కచెల్లెళ్ళకి మంచి సంబంధాలు చూసి వైభవంగా పెళ్ళి చేయడంలో తండ్రికి చేదోడు వాదోడుగా వుండటమే కాకుండా పండగలకి, పబ్బాలకి వాళ్ళని తమింటికి ఆహ్వానిస్తాడు. ఇది అని చెప్పటానికి ప్రత్యేకంగా ఏమీ కారణం లేకపోయినా అన్నదమ్ములిద్దరి మధ్యా ఈ విధమైన ఒక గుప్త యుద్ధం నిశ్శబ్దంగా

జరుగుతోంది. అందుకే ఆయన తల్లి చిన్న కొడుక్కి తెలియకుండా సమయ చేత అప్పుడప్పుడు పెద్ద కొడుక్కి వుత్తరాలు రాయించుకుంటుంది. "పాపం, తల్లి ప్రేమ. ఇద్దరి కొడుకుల మధ్య నడుస్తున్న ఈ అకారణ స్పర్థలలో అనవసరంగా బామ్మ, తాతయ్య నలిగిపోతున్నారు. తాతయ్య మగవారు కాబట్టి బింకంగా వుంటారు. పాపం. బామ్మ ఆడది కాబట్టి ఇలా బయట పడుతూ వుంటుంది. ఏదో అప్పుడప్పుడు తమకిష్టం లేని పనులు చేసారని తల్లిదండ్రులు పిల్లల్ని వదులుకుంటారా ఏమిటి? అనుకుంటూ వాళ్ళ బామ్మ మీద జాలి పడుతూ వుంటుంది సమయ. "చెప్పు బామ్మా" అంది వుత్తరం రాయటానికి సిద్ధంగా కూర్చుని. ఆమె వుత్తరం రాయటం పూర్తి చేసి stamp అతికించటానికి లోపలికి వెళ్ళబోతూవుంటే "వుద్యోగం, పెళ్ళిఅంటూ బాధ్యతల్లో ఇంకా ఇరుక్కోలేదుకాబట్టి ప్రస్తుతం నీకు ఇలా వుత్తరాలు రాసిపెట్టడానికి తీరిక వుంది. పెళ్ళయిన తర్వాత అత్తవారింటికి వెళ్ళిపోతే అప్పుడు మీ అమ్మనే అడగాలి నేను నా పని కాస్త చేసి పెట్టమని" అన్నారు బామ్మగారు సమయతో. "అమ్మ రాసిపెడుతుందిలే బామ్మా" అంది సమయ.

"బామ్మగారూ! మీరు, పెద్దయ్యగారు భోజనానికి వస్తారా? వడ్డిస్తాను" అన్నారు వంటావిడ. వంట అయిపోగానే బామ్మగారికి, తాత్తగారికి మడిగా వడ్డించి ఇంటికి వెళ్ళిపోతారు ఆవిడ. మిగిలిన వారందరి భోజనాలు ఆ తర్వాత చూసుకునేది సమయే! ఆ పనులన్నీ చూసుకొని పారు, నూకరాజులకి కూడా అన్నం పెట్టి వంటింట్లో అన్నీ సవరించి బయటకు వచ్చేసరికి వంటింటి ముందు వసారాలో ఆమె తల్లి ఎదురు చూస్తోంది సమయ కొరకు. "సమయా! స్టోర్ రూంలో పెద్ద స్టీల్ డబ్బాలు పెట్టాను, ఇలా తీసుకురా. ఈ కరిగిన నెయ్యి మళ్ళీ పేరుకునే లోపల మినపసున్ని చేయాలి" అంది ఆవిడ. మినపసున్ని సన్నాహాలన్నీ పూర్తి చేసుకుని. సమయకి అప్పుడు గుర్తొచ్చింది. భోజనాలయిన తర్వాత ఆరోజు చెయ్యటానికి agenda లో వాళ్ళు పెట్టుకున్న పని, ఎనిమిది నెలల క్రితం పెళ్ళి చేసి పంపించిన సమయ అక్క అప్పుడు మొగుడితో పాటు మొదటి సంక్రాంతికి పుట్టింటికి వస్తోంది. ఆమెతో పాటు ఆమె మేనత్తలు కూడా వస్తున్నారు. వీరందరికి సారెకు ఇవ్వటానికి మినపసున్ని చేయాలి. "వంటావిడ ఎలాగో వీలు చూసుకొని చేయమని అడుగుతానంటే వద్దన్నావు. ఇప్పుడుచూడు కనీసం మూదువందలన్నా మినపసున్ని లడ్డూలు చేయాలి. అంతసేపు కూర్చుని లడ్డూలు కట్టాలంటే నా నడుం నొప్పి పెడుతుంది. ఇంకా చలిమిడి బూంది లడ్డూ ఎప్పుడు చేయాలి? అంది ఆవిడ సమయ మీద విసుక్కుంటూ. "అబ్బ విసుక్కోకమ్మా, పాపం, పిన్నిగారు కూడా తన కూతురు, కొత్తల్లుడితో బిజీగా వున్నారని మినపసున్ని మేమే చేసుకుంటాం అన్నాను. ఒక్క రెండు రోజులైన తర్వాత బూంది లడ్డు, చలిమిడి ఆవిడే చెస్తానన్నారులే. అప్పుడు నేను కూడా సహాయం చేస్తానన్నాను" అంది సమయ మినపసున్ని చేయటం మొదలు పెడుతూ. "ఇప్పుడంటే పనీపాట ఏమీలేక కావలసినంత తీరిక కాబట్టి ఇవన్నీ చేయటానికి సిద్ధం అయ్యావు. రేపు పెళ్ళయి నీవు కూడా మీఅక్కలాగా వెళ్ళిపోతే అప్పుడు మా పనివాళ్ళతో మా తిప్పలేవో మేమే పడాలి" అంది ఆవిడ తనుకూడా మినపసున్ని చేస్తూ. కానీ మినపసున్ని చేయడం మూడొంతులు పూర్తి అయిన తర్వాత "ఇంక నా వల్ల కాదు సమయా! కాస్త నడుం వాల్చనిదే నేను మనిషిని కాను. ఇది రేపు పూర్తి చేద్దాంలే" అంటూ సమయ తల్లి వెళ్ళిపోయింది కాస్సేపు పడుకోవటానికి. ఆ మిగిలిన పని కూడా పూర్తి చేసి మినపసున్ని డబ్బాలన్నీ గట్టిగా మూత పెట్టి స్టోర్ రూంలో సర్ది బయటకొస్తుంటే అప్పుడే లోపలికి అడుగు పెడుతున్న వంటాయన కనిపించారు.

"ఇంట్లోకి అడుగు పెడుతుంటే అన్నపూర్ణ దర్శనం అయింది. సమయమ్మా! ఎలా వున్నావు? అన్నాడు ఆయన పలకరింపుగా. "బాగానే వున్నాను. మీరెలా వున్నారు బాబాయిగారూ! ఇవాళ రేపట్లో నేనే మీకు కబురు పెడదామనుకున్నాను". అంది సమయ ఆయనకు నమస్కరిస్తూ. "నాకు తెలుసమ్మా! నువ్వేమీ కబురు పెట్టనక్కరలేదు. శ్రీరామనవమి దగ్గరకొస్తుంటే గుళ్ళో పెద్దయ్యగారు చేయించే అన్నదానం సంగతి ఎలా మర్చిపోతాను?" అన్నారు ఆయన. "నువ్వు తీరికగా ఇంట్లో వున్నావు కాబట్టి ఈ పనులన్నీ చేస్తున్నావు. నీ పెళ్ళయిన తర్వాత ఇవన్నీ చిన్నయ్యగారే చూసుకోవాలి" అన్నారు మళ్ళీ. సమయ సమాధానం ఏదీ చెప్పలేదు. ఆయనతో ఆ అన్నదానం సమయంలో చేయవలసిన వంటకాల సంగతి మాట్లాడి "ఒక్కసారి అమ్మ, బామ్మతో కూడా మాట్లాడండి. ఇప్పుడు పడుకున్నారు" అంది. తర్వాత ఆయనను పపించి లోపలికి bedroom లోకి వెళితే అక్కడ రామకోటి పుస్తకాలు కనిపించాయి.

అవన్నీ లెక్కపెట్టి బీరువాలో పెడుతూ "ఇంకా లక్షన్నర రాయాలి, అమ్మకు చెప్పాలి, శ్రీరామనవమి లోపు చకచకా పూర్తి చేయమని" అనుకుంది మనసులో. "అమ్మాయిగోరూ! post అబ్బాయి వచ్చాడండి" అని పారు చెప్తే బయటకు వచ్చింది సమయ. Register post లో వచ్చిన parcels అన్నీ లెక్క పెట్టుకొని సంతకం చేసి అతన్ని పంపించేసింది. ఇంతలో మధ్యాహ్నం కునుకు ముగించి లేచి వచ్చిన బామ్మగారు అడిగారు "సమయా! ఏమిటి ఆ డబ్బాలు? ఎవరు పపించారు వాటిని అన్నారు "నెయ్యి డబ్బాలు బామ్మా! బెంగులూరులో ఒక dairy farm వాళ్ళు ఆవు పాలు, ఆవు నెయ్యి అమ్ముతారు. వాళ్ళ దగ్గర నుండి ఆవు నెయ్యి తెప్పిస్తున్నాను" అంది సమయ. "ఆవు నెయ్యా? ఎందుకు" అని అడిగారు బామ్మగారు అయోమయంగా. "ఎందుకేమిటి బామ్మా! ఆవు నెయ్యితోనేగా లక్షవత్తుల నోము చేస్తారు! మరి నువ్వు, అమ్మ చేయబోయే లక్షవత్తుల నోముకి నెయ్యి కావద్దా" అంది సమయ "అందుకా! అయినా ఇన్నా?" అని ఆవిడ ఆశ్చర్య పోతూవుంటే" మరి రెండు లక్షల వత్తులు కాల్చటానికి కావద్దా ?" ఇంకా వాళ్ళు ప్రస్తుతం కొన్నేపంపించారు. మిగిలినవి డబ్బాలు మళ్ళీ పంపుతారు" అంది సమయ.నూకరాజు సహాయంతో అవన్నీ లెక్కపెట్టి కొట్టుగదిలోని spare refrigerator లో పెట్టించింది.

మధ్యాహ్నం నిద్ర పోయిన వాళ్ళు మెల్లగా అందరూ లేచి వస్తున్నారు. సమయ వంటింట్లోకి వెళ్ళి అందరికీ కాఫీలు పెట్టింది. స్టీల్ డబ్బాలోంచి తీసి అందరికీ కాజాలు, జంతికలు ప్లేట్లలో సర్ది అందించింది అందరికీ. "సమయా! నువ్వు కాఫీ బాగా కలుపుతావమ్మా. ఇప్పుడంటే తీరికగా ఇంట్లో వున్నావు కాబట్టి మధ్యాహ్నం కాఫీల పని నువ్వు చూస్తున్నావు. లేకపోతే మీ అమ్మే చూసుకోవాలి ఇదంతా. కాఫీ ఇంత బాగా పెట్టడం ఎలాగో మీ అమ్మకీ, బామ్మకీ కూడా నేర్పు" అన్నారు తాతయ్య. "మనవరాలంటే ఎంత ప్రేమ వున్నా మరీ అంత పక్షపాతం చూపించటం అన్యాయం మామయ్యా! మాకామాత్రం కనీసం కాఫీ కలపడమన్నా రాదా?" నవ్వుతూ అంది సమయ తల్లి. అందరూ నవ్వుకున్నారు.

సమయ కాఫీలు, టిఫిన్ల పని ముగించేసరికి పారు ఒక పెద్ద బుట్ట నిండా గోరు చిక్కుడుకాయలు తీసుకొచ్చింది తరగటానికి "మన పొలం గట్టున కాసాయమ్మా, లేతగా చాలా బావున్నాయి. రేపటి కూరకి వలిచి సిద్ధం చేస్తానని వంటక్కకి చెప్పాను" అంది సమయతో. అవన్నీ తను కూడా గబగబా వలుస్తూ ఆ గోరుచిక్కుడు కాయలన్నీ చకచకా తరగడంలో సహాయపడింది సమయ.

"పారూ ఈ పని అయిందిగా! ఇంక నీ పుస్తకాలు తెచ్చుకో. నిన్న చెప్పిన ఆ లెక్కలు చేసావా? ఏదీ చూపించు" అంది సమయ పారుతో. ఏమీ మాట్లాడకుండా అక్కడే నిలబడ్డ పారుని చూస్తూ "ఏమిటలా నిలబడ్డావు ఏమీ చెప్పకుండా? చదువంటే నీకు నచ్చదు. డబ్బులెక్కలు సరిగ్గా చెప్పటం లేదు. అబద్దాలాడుతున్నాడని నూకరాజు మీద పోట్లాడతావు. మరి నువ్వు లెక్కలు నేర్చుకుంటే ఆ తిప్పలేవీ ఇంక వుండవుగా! పద, పద, త్వరగా రావాలి" అంటూ సమయ పారుని వత్తిడి చేసి ఆమె చేత పుస్తకాలు తెప్పించి లెక్కలు చెప్పటం మొదలుపెట్టింది. ఇంతలో సాయంత్రం వంట కోసం వంటావిడ మళ్ళీ వచ్చారు. ఆ పూటకి ఏం చేయాలో చెపుతూ "చపాతీలకి పిండి కలిపి పెట్టండి పిన్ని గారూ! రాత్రి భోజనం చేసే ముందు నేను వేడివేడిగా చేసి పెడతాను. ఇప్పుడు మీరు చపాతీలు వత్తక్కరలేదు" అంది సమయ. ఆమె వంటింట్లోంచి బయటకు వస్తోంటే తండ్రి పిలుపు విని బయటకు వచ్చింది. "ఈ డబ్బు లోపల దాచమ్మా, నరసరాజు పంపించాడు" అంటూ ఆయన ఒక పెద్ద bag ని ఇచ్చారు సమయకు. సమయ దాన్ని అందుకొని లోపలికి తీసుకెళ్ళి బీరువాలో పెట్టే ముందు ఒక్కసారి bag తెరచి చూసింది. డబ్బంతా వంద నోట్లలో వుంది. లెక్కపెట్టి పుస్తకంలో లెక్కరాసి, తారీకు వేసి డబ్బంతా భద్రంగా పద్దుపుస్తకంతో పాటు బీరువాలో పెట్టి బయటకు వచ్చింది. "ఇవాల్టి డబ్బు ౩౦ వేలు వుంది నాన్నా. నరసరాజు అంకుల్ ఇంకా 45000 ఇవ్వాలి" అని తండ్రికి లెక్క చెపుతూ గుర్తు చేసింది. "అవునమ్మా, ఆ లెక్కలన్నీ ఫోనులో చెప్పాడు. వడ్డీ లేకుండా ఇంత డబ్బు సహాయం చేసి అవసరంలో ఆదుకున్నామని, పాపం, ఎప్పుడూ పొగుడుతూ వుంటాడు. ఈ డబ్బు వ్యవహారాలన్నీ నువ్వే చూసుకుంటావని ఇప్పుడంటే సమయ తీరికగా వుంది కాబట్టి ఇవన్నీ చూసుకుంటోంది, లేకపోతే ఇవన్నీ నువ్వే చూసుకోవాలి అని నాకు ఎప్పుడూ చెపుతూ వుంటాడు" అన్నాడు ఆయన. మూడేళ్ళ క్రితం నరసరాజుగారి వ్యాపారంలో నష్టం వచ్చి ఆయన పరిస్థితి almost దివాలా తీసేదాకా వస్తే వెంటనే తండ్రిని ప్రోద్బలం చేసి ఆయన చేత

అయిదు లక్షలు అప్పు ఇప్పించింది సమయ. దాంతో వ్యాపారాలన్ని నిలబెట్టుకుని కాస్త నిలదొక్కుకున్నాడు - ఆయన. కూతురులాంటి సమయ చేసిన సహాయం ఆ-యన ఎప్పుడూ మరిచిపోలేదు.

"బామ్మా! అమ్మా! తయారవండి. గుడికి వెళ్దామన్నారుగా! మీరుకూడా వస్తారా? అంటూ బామ్మని, అమ్మని హెచ్చరించి తాతగారిని అడిగింది సమయ. అందరూ తయారయి సాయంత్రం గుడికి బయలుదేరారు. "పెద్ద కారు కావాలి. లేకపోతే అందరికీ చాలదు" అని వాళ్ళు అనుకుంటూ వుండగానే సమయ గరాజులోంచి పెద్దకారు బయటకు తీసుకొచ్చి వాళ్ళముందు పెట్టింది. డ్రైవరు సీటులో కూర్చున్న సమయను చూస్తూ "డ్రైవరు ఏమయ్యాడమ్మా? నువ్వెందుకు drive చేస్తున్నావు?" అని అడుగుతున్న తాతయ్యతో "వాళ్ళబ్బాయికి జ్వరంగా వుందట తాతయ్యా. నేనే ఇంటికి పంపించేసాను. మిమ్మల్ని అందరినీ తీసికెళ్ళటానికి నేను వున్నాను కదా!" అంది సమయ. "అమ్మాయిగోరూ! ఇప్పుడి మీకు కావలిసినంత తీరిక కాబట్టి డ్రైవరన్న పనికూడా మీరే సేత్తుండారు. లేకపోతే పెద్దయ్యగారికి సిక్కే మరి" అన్నాడు నూకరాజు. "అందుకే నీకు డ్రైవింగు నేర్పిస్తానంటే నువ్వేమో భయం అంటావు. భయం లేదు, ఏమీ లేదు, రేపటినుండి మధ్యాహ్నం నా దగ్గర driving నేర్చుకోవాలి నువ్వు" అంది సమయ నూకరాజుతో "మళ్ళీ ఆ పని కూడా నీకేనా? ఏదన్నా driving school లో చేర్పించవే" అంటున్న బామ్మగారితో "స్కూలు గీలు వద్దండీ పెద్దమ్మగోరూ. అమ్మాయిగారైతేనే నేర్చుకుంటా" అన్నాడు సనుగుతూ నూకరాజు. "సమయ అయితే వాడి ఆటలు చెల్లుతాయని అలా అంటున్నాడు" అంటున్న తల్లితో "అదిగాదండీ సిన్నమ్మగోరూ, అమ్మాయిగోరూ తీరిగ్గా వుండగా వుత్తగా డబ్బు ఖర్చు ఎందుకని...." అంటూ గొణిగాడు. "నీ మొహం" అంటూ అందరూ నవ్వారు.

వీళ్ళందరూ గుడికి వెళ్ళేసరికి ధనుర్మాసం పర్వ దినాలు కాబట్టి గుడి అంతా జనంతో కోలాహలంగా వుంది. సమయ తాతగారు వచ్చారని అందరూ ఆయనకు నమస్కరిస్తూ ముందుకు వెళ్ళటానికి తోవ ఇస్తున్నారు. ఆయన పూర్వీకులే ఆ గుడిని కట్టించారు. వారి కుటుంబ క్షేమం కోసం ప్రత్యేకమైన అర్చనలు చేయించి ప్రసాదం తింటూ అందరూ గుడి ఆవరణలో కూర్చున్నపుడు "మీరందరూ ఇక్కడే వుండండి, ఇప్పుడే వస్తాను" అంటూ సమయ పూజార్ల quarters వైపు చకచకా నడిచింది. ఒక పావుగంటలో తిరిగొచ్చిన సమయను "ఎక్కడికెళ్ళావే? వెయ్యి గుళ్ళ పూజారివి, మళ్ళీ ఎవరు కనిపించారు?" అని అడిగింది బామ్మగారు. "అత్తయ్యగారితో మాట్లాడటానికి పూజారి మామయ్యగారింటికి వెళ్ళాను బామ్మా. ఇంకో వారం రోజుల్లో రెండు లక్షల వత్తులు చేయటం పూర్తి అవుతుందని చెప్పారు" అంది సమయ. "చాలా రోజులనుండే సేత్తున్నారు కదూ అమ్మగోరూ" అంటున్న పారుతో, అవునే! ఒకటా? అరా? రెండు లక్షల వత్తులంటే మాటలా? బామ్మ, అమ్మ చేయబోయే లక్షవత్తుల నోముకి ఇద్దరికీ కలిసి మొత్తంరెండు లక్షల వత్తులు కావాలి. అదృష్టం కొద్దీ అత్తయ్యగారు చేసి పెడతానన్నారు కాబట్టి బతికాము" అంది సమయ. కాసేపట్లో అందరూ ఇంక ఇంటికి వెళ్ళడానికి లేచారు. ఇంతలో అక్కడికి పూజారిగారితో పాటు గుడి మేనేజరుగారు కూడా వచ్చారు. సంక్రాంతికి జరగబోయే గుడి anniversary special ప్రోగ్రాముల గురించి, శ్రీరామనవమినాడు జరగబోయే సీతారాముల కల్యాణం గురించి వారితో తాతయ్య, తండ్రితో బాటు సమయ కూడా మాట్లాడింది. "సమయమ్మకి ఇపుడు తీరిక కాబట్టి ఇవన్నీ మాట్లాడటానికి టైము దొరుకుతోంది. ఆ తర్వాత ఇంక గుడికి ఇంటికి రావటానికి కూడా తీరిక వుంటుందో లేదో" అన్నారు మేనేజరుగారు. అందరూ నవ్వుతూ లేచారు.

ఇంటికి వెళ్తున్నపుడు దారిలో బజారులో నగల కొట్టు ముందు కారు ఆపింది సమయ. "మళ్ళీ ఇక్కడెందుకు ఆపావే? నీతో బయటకొస్తే ఇంతే! ఇలా ప్రతిచోటా ఆగుకుంటూ నీ పనులన్నీ పూర్తి చేసుకొని ఇంటికి చేరేసరికి ఆ పుణ్యకాలం కాస్తా గడిచిపోయి తాతయ్యకి భోజనానికి ఆలస్యం అయ్యేటట్లుంది" విసుక్కుంటూ అంటున్న తల్లితో "అక్కకి మనం ఇద్దామనుకున్న కెంపులసెట్టు పూర్తి అయ్యిందో లేదో కనుక్కున్నానమ్మా. లాకెట్టు డిజైను నేను కొంచెం మార్చమన్నాను కదా! అది ఎలా చేసాడో, ఎలా వుందే చూసి వచ్చాను" అంది సమయ. "తొందరగా తీసికెళ్తాలే అమ్మా. తాతయ్యకి ఆలస్యం కాదు" అంటూ వేగంగా అందరినీ ఇల్లు చేర్చింది సమయ. ఇంట్లోకి అడుగు పెడుతూనే చకచకా చపాతీలు చేసి వేడివేడిగా చపాతీలు అందరికీ భోజనాలు ఏర్పాట్లు చేసింది.

భోజనాలు చేస్తున్నపుడు "నాన్నా! ఆ ricemill లో ఏవో రెండు మెషిన్లు పాడయినాయన్నారు. వాటి సంగతేదో చూసారా ఇవాళ? అని అడిగింది తండ్రిని. "రేపు వస్తాడమ్మా వాటి సంగతి చూసే మనిషి. ఏమంటాదో చూడాలి" అన్నాడు ఆయన. అందరికీ భోజనాలు అయిన తర్వాత పారు, నూకరాజులకి కూడా అన్నం వడ్డించి వంటిల్లంతా సవరించి బయటకొచ్చింది సమయ. బామ్మ, తాతయ్య ఆమె కోసం ఎదురు చూస్తున్నారు. "రా సమయా నీ కోసమే నిద్ర ఆపుకొంటున్నాం" అన్నారు ఆమెను చూస్తూనే. "నా కోసం కాదులే తాతయ్య నేను చదివబోయే రుక్మిణీ కల్యాణం కోసం" అంది నవ్వుతూ సమయ పురాణం చదవటం కోసం పుస్తకం తెచ్చుకుంటూ. ఆమె రాగయుక్తంగా చదివిన ఆ రుక్మిణీకల్యాణం పద్యాలను ముగ్ధులై విన్నారు వారిరువురూ. "సమయా! నీ గొంతులో అమృతం వుందే! అర్ధయుక్తంగా ఎంత బాగా పాడావు ఆ పద్యాలన్నీ!" అన్నారు బామ్మగారు పరవశంగా సమయను మెచ్చుకుంటూ. "పెళ్ళి కావలిసిన పిల్లలు రుక్మిణీ కల్యాణం చదివితే త్వరగా వారికి ఆ కల్యాణ గడియలు తోసుకు వస్తాయంటారు. అందుకేగా నువ్వు సమయ చేత రుక్మిణీ కళ్యాణం చదివిస్తున్నావు. స్వామి కార్యం, స్వకార్యమూనూ" అన్నారు తాతయ్యగారు. "వీటన్నిటి పుణ్య ఫలమే దానికి బంగారం లాంటి వరుడిని సంపాదించి పెట్టింది.విరించి ఎంతో మంచి వాడు. ఇంక చాల్లే సమయా! వెళ్ళి పడుకో, మళ్ళీ రేపు పూలకోసం తెల్లవారుఝూమున లేస్తావు. చాల్లే తల్లీ, వెళ్ళి పడుకో" అన్నారు బామ్మగారు సమయ వైపు ఎంతో మెరిపెంగా చూస్తూ. వారిద్దరికీ గుండెలదాకా దుప్పటికప్పి, లైటు ఆర్పి, night light on చేసి తన రూములోకి వెళ్ళింది సమయ. పక్కమీద వాలి ఏదో పుస్తకం చదువుదామని చేతిలోకి తీసుకుంటే కళ్ళు మూతలు పడతం మొదలుపెట్టాయి. ఇంతలో ఫోను మోగింది. నిద్రలోకి జారుతున్న సమయ ఒక్కసారి ఉలిక్కిపడి, రిసీవరు చేతిలోకి తీసుకొని మెల్లగా హలో అంది. అవతలి వైపు నించి విరించి సమయా అంటున్నాడు. విరించి గొంతు విని ఒక్కసారి లేచి కూర్చుంది సమయ. "విరించీ! ఎలా వున్నావు?" అంది సంభ్రమంగా. "బాగానే వున్నాను" అన్న విరించి సమాధానం పట్టించుకోకుండా "నీ thesis accept అయిపోయిందా? నీ graduation ఎప్పుడు? ఆ మధ్య చేసిన నీ job interview ఏమైంది?" అంటూ గబగబా అడిగింది. విరించి పెద్దగా నవ్వాడు. "my god! ఒకేసారి ఇన్ని ప్రశ్నలా! అన్నిటికీ కలిసి సామూహిక సమాధానం చెప్తున్నాను, విను. అంతా బాగానే జరిగింది. ఇంకో పది రోజుల్లో PHD చేతికి వచ్చేస్తుంది. రాబోయే semister నుండి ఒక యూనివర్శిటీలో faculty లో join అవుతున్నాను" అన్నాడు సంతోషంగా. ఇంతలోనే అతని గొంతు చాలా మెత్తగా మారింది. "సమయా! ఇప్పుడు మన పెళ్ళికి ఇంకే ఆటంకమూ లేదు. మంచి ముహూర్తము చూడమని మా నాన్నకు చెప్తాను." మంద్రస్థాయిలో ప్రేమగా అన్నాడు విరించి. సమయకి సిగ్గు చాలా ముంచుకొచ్చింది. ఆమె దగ్గరనుండి ఏ సమాధానము రాకపోయే సరికి "సమయా! వింటున్నావా? ఏం చేస్తున్నావు? నిద్ర పోతున్నావా అప్పుడే"? అన్నాడు. "లేదు లేదు నిద్ర పోవటం లేదు, వింటున్నాను నీమాటలు. అయినా అప్పుడే నిద్రా అంటావేమిటి? మీ అమెరికాలో ఇప్పుడు పగలు కాబోలు. కానీ మాకు రాత్రి పదకొండు దాటింది తెలుసా"? అంది సమయ. "సరేలే ఇంతకీ నువ్వు నేను చెప్పిన కోర్సులకో చేరావా, లేదా? చదవటం మొదలుపెట్టావా, లేదా?" అన్నాడు ఆరాగా విరించి. సమయ కొన్ని సెకన్లపాటు సందేహించింది. తర్వాత మెల్లగా "లేదు" అంది తటపటాయిస్తూ. "లేదా ఇంకా మొదలుపెట్టలేదా? సమయా! నిన్ను వెంటనే ఆ కోర్సులలో చేరమని గట్టిగా చెప్పానా? లేదా? అవన్నీ చేస్తేనే ఇక్కడ మంచి ఉద్యోగాలు వచ్చే అవకాశం వుంది. నువ్వు త్వరగా అవన్నీ పూర్తిచేస్తే ఇక్కడికి వెంటనే రావటానికి ఇంక ఏవిధమైన అడ్డంకులూ వుండవు. అయినా అసలు ఇంకా ఎందుకు మొదలుపెట్టలేదు ఆ కోర్సులు? రోజంతా ఏమీ పనిపాటా లేకుండా తీరికగానే వుంటావు కదా! ప్రస్తుతం ఉద్యోగం అంటూ ఏమీ లేదుగా! మరి టైమంతా ఎలా గడుపుతావు? టి వి చూస్తూన్నావా? బోలెడంత ఖాళీ సమయం వ్యర్ధంగా దాటవేస్తున్నావు. అనవసరంగా జారవిడుచుకున్న సమయం మళ్ళీ తిరిగి రాదు" అన్నాడు విరించి కొంచెం విసుగ్గా, కొంచెం మందలింపుగా. సమయకు ఒక్క క్షణంపాటు ఏమనాలో తెలియలేదు. నీకు చాలా తీరిక అంటున్న విరించి మాటలకి ఒక్కసారి నవ్వొచ్చింది. "విరించీ! కోపం తెచ్చుకోకు. వెంటనే చేరుతాలే.

*Contd on page… 97*

ఆలోచనలని మనకి అందిస్తాయి. కొంతమంది రచయితల్లా పుస్తకాలు రాసి పారేసి కొంత ఖ్యాతిని, చదివిపారేసి నలుగురిలో పేరు కావాలని కోరుకున్న వ్యక్తి కాదు. చాలా స్పష్టంగా ఒక rebel తత్త్వం, ఒక తిరుగబడే వ్యక్తిత్వం అనుక్షణం ఇతరులకోసం వ్యధ చెందే మనసు, ఇతరుల కష్టాలని తనవిగా భావించి కళ్ళు చెమర్చే హృదయం, అమెరికన్ తెలుగు జీవితంలోని జడత్వాన్ని, డొల్లతనాన్ని, పరాయీకరణని, పట్టించుకోని తనాన్ని, లేని గొప్పలు డాంబికాలు చెప్పుకుని బతికే hypocracy ని, నటనల్ని, మర్యాదస్తుల ప్రపంచాన్ని, insensitivity ని వ్యతిరేకిస్తూ పూర్తిగా భిన్నంగా సాగిన సాహిత్య వ్యక్తిత్వం ఇందిరగారిది. మన మధ్య prosaic గా ఉన్నడొల్లతనపు నిశ్శబ్దాన్ని బద్దలు కొట్టిన poetry ఇందిరగారిది.

ఇందిరగారు మన మధ్యన లేనందుకు హృదయం బరువెక్కి, కళ్ళు చెమర్చినా ఆమె మనకింత మంచి కవిత్వాన్ని మిగిల్చి వెళ్ళినందుకు ఆనందంగా ఉంది. ఇందిరగారు నిస్సందేహంగా చిరంజీవి. మన మధ్య ఆమె, ఆమె ఆశ ఎల్లప్పుడూ సజీవంగానే ఉంటాయి.

*Contd from page… 95*

**తీరిక**

నువ్వేమీ దీనిగురించి అనవసరంగా ఆలోచించకు“ అంది నవ్వు ఆపుకుంటూ మెల్లిగా. ఇంకొంచెంసేపు అతనితో మాట్లాడి ఫోను పెట్టేసిన తర్వాత అతని మాటలు గుర్తొచ్చాయి సమయకి. ఆ తర్వాత ఉదయం నుండి తన దినచర్య గుర్తొచ్చింది. ప్రతీవాళ్ళు మాటిమాటికీ తనకి పనేమీ లేదని, బోలేడంత తీరికని గుర్తుచేసేవాళ్ళే! కాని వాస్తవం ఆలోచిస్తే తనకి ఒక్క క్షణం తీరికకూడా లేదు సరికదా, అసలు ఊపిరి పీల్చుకోవటానికి కూడా సమయం లేదు. ఇంక కోర్సులలో చేరటానికి టైము ఎక్కడ వుంటుంది? ఇలా ఆలోచిస్తుంటే ఎందుకో, సమయకి మళ్ళీ ఇంకోసారి పెద్దగా నవ్వొచ్చింది. ఆ రాత్రి నిద్రలో కూడా సమయ అప్పుడప్పుడు నవ్వుకుంటూనే వుంది.

*******


Middlesex Community Medical Care

Board Certified in Internal Medicine

**Dr. Geeta Yalamanchi, MD**



530 Union Avenue, Suite #2
Middlesex, NJ 08846

(732) 667-3288

www.mcmcare.com

Committed To Excellence In Patient Care

* ALL MAJOR INSURANCES ACCEPTED *ACCEPTING NEW PATIENTS NOW